సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం : 5 : జూన్ : 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న 20 కోడెలను వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం మహబూబ్‌నాయక్‌తండాకు చెందిన మల్లి కార్జున గోశాలకు ఆదివారం అందించారు.



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో భారీగా భక్తులు తరలివస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మెట్టప్రాంతం సాగులోకొచ్చింది



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: తెలంగాణ వచ్చాక మెట్టప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయని, మండుతున్న ఎండల్లోనూ మత్తడులు దూకుతున్నాయని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈనెల 7న నిర్వహించే సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. మిషన్ కాకతీయ ద్వారా 400 చెరువుల్లోకి నీరు వచ్చిందన్నారు. ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి, ఏఈ విష్ణు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకలారీని అడ్డుకున్న రైతులు



ఇసుకలారీని అడ్డుకుంటున్న రైతులు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి నుంచి వెళ్తున్న ఇసుక లారీని గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. లారీలు రాక గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని, ఇసుక రవాణాకు మాత్రం నిత్యం వస్తున్నాయన్నారు. ధాన్యాన్ని తీసుకెళ్లేందుకు లారీలు పెట్టాలని రైతులు కోరగా.. ధాన్యంతో మిల్లుకు వెళ్తే నాలుగైదు రోజులు అక్కడే ఉండాల్సి వస్తోందని డ్రైవర్ పేర్కొన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలకు లారీలు పంపించాలని రైతులు కోరారు.

యారన్ సబ్సిడీ విడుదల చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్ కార్మికులకు యారన్ సబ్సిడీ విడుదల చేయాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2020 బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ మంజూరులో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ఇప్పటి వరకు వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయలేదని మండిపడ్డారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 7న పవర్‌లూమ్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. నాయకులు రాజశేఖర్, నక్క దేవదాస్, గుండు రమేశ్, సురేష్, ఆంజనేయులు ఉన్నారు.

గల్ఫ్‌పాలసీ తీసుకురావాలి

- బీఎంఎస్ జిల్లా కన్వీనర్ తోట ధర్మేందర్



చర్చిస్తున్న ధర్మేందర్

ముస్తాబాద్(సిరిసిల్ల): జీ–20, ఎల్–20 సమావేశంలో తెలంగాణ గల్ఫ్‌బోర్డు పాలసీని తీసుకురావాల్సిన అవసరాన్ని చర్చించినట్లు బీఎంఎస్ జిల్లా కన్వీనర్ తోట ధర్మేందర్ తెలిపారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో అసంఘటిత రంగ కార్మికులు, సామాజిక భద్రత అంశంపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వుమ్మన్నగారి దేవేందర్‌రెడ్డితో గల్ఫ్‌కార్మికుల సమస్యలు వివరించినట్లు చెప్పారు. తెలంగాణలో లక్షలాది మంది యువకులు గల్ఫ్ దేశాలలో మగ్గుతున్నారన్నారు. శ్రమదోపిడీతోపాటు అనారోగ్యానికి గురవుతున్న కార్మికులు కనీస హక్కులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్‌పాలసీని తీసుకొచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని చర్చించినట్లు చెప్పారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం బాధ్యుడు పరికిపండ్ల స్వదేశీ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నా.. నీవే దిక్కు !

- ఆలయ పరిసరాల్లో వైద్యసేవలు కరువు
- అస్వస్థతకు గురవుతున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు



❒ ఈ చిత్రంలో కింద పడిపోయిన భక్తుడు వరంగల్‌కు చెందిన రమేశ్. ధర్మగుండంలో స్నానాలు చేస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికంగా సహాయం అందకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



రాజన్న ఆలయంలో భక్తులు



❒ ఈ చిత్రంలో కిందపడిపోయిన వ్యక్తి నిజాంసాగర్‌కు చెందిన సాయిలు. ఇతను కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకునేందుకు వచ్చారు. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగిపోవడంతో ఫిట్స్ వచ్చాయి. క్యూలైన్‌లో నుంచి బయటకు తెచ్చే క్రమంలోనే ప్రాణాలు వదిలాడు. అరగంట వరకు ఎవరూ స్పందించలేదు. పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు. సరైన సమయంలో కనీసం ప్రథమ చికిత్స అంది ఉంటే ప్రాణాలు నిలిచేవి.



❒ ఈ చిత్రంలో కనిపిస్తుంది జగిత్యాల ప్రాంతంలోని మోతెకు చెందిన బాలుడు డి.ముఖేశ్. రమేశ్–సృజన దంపతులు తమ పిల్లలతో కలిసి వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వారి కుమారుడు ముఖేశ్ సొమ్మసిల్లి పడిపోయాడు. ఆ దంపతులు ఎంత ప్రాధేయపడిన ఎవరూ స్పందించలేదు. వెంటనే ఆటోలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు.

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చి అస్వస్థతకు గురవుతున్న భక్తులకు ఆలయ పరిసరాల్లో ప్రథమ చికిత్స సేవలు సైతం అందడం లేదు. కనీసం సహాయం చేసేందుకు ఆలయ అధికారులు ముందుకు రావడం లేదు. కుటుంబ సభ్యులే ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. కొన్నాళ్లపాటు ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేసిన వైద్యాధికారులు తర్వాత దాన్ని మూసివేశారు. ఇటీవల ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడం.. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో క్యూలైన్‌లలో గంటలకొద్దీ నిల్చొని అస్వస్థతకు గురైన సంఘటనలు వరుసగా జరిగాయి. ప్రథమ చికిత్స కేంద్రం మూసివేసి ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మూతపడ్డ ప్రథమ చికిత్స కేంద్రం

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు అస్వస్థతకు గురైతే వైద్యసేవలు అందించేందుకు రాజేశ్వరపురం వసతి గదుల్లో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులే సేవలందించిన ఈ కేంద్రం తర్వాత మూతపడింది. దీంతో ఆలయ పరిసరాల్లో అస్వస్థతకు గురయ్యే భక్తులకు కనీస వైద్యసేవలు కరువయ్యాయి. భక్తుల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా కనీసం ప్రథమ చికిత్స కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అస్వస్థతకు గురవుతున్న భక్తులు తిప్పాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లేలోపు పరిస్థితులు విషమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

జాతరాగ్రౌండ్‌లో బస్తీ దవాఖానా ప్రారంభించాం

భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని జాతరాగ్రౌండ్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభించాం. భక్తులతోపాటు స్థానికులకు వైద్య సేవలందించనున్నాం. ఏమైనా ఇబ్బందులుంటే ఆస్పత్రికి సమాచారం అందించడంతోపాటు ఏరియా ఆస్పత్రికి రావాలి.

– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

రాష్ట్రస్థాయికి అల్మాస్‌పూర్ పాఠశాల ఎంపిక

- ఇన్నోవేషన్ చాలెంజ్‌లో రాణించిన విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన పరికరాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్నోవేషన్ చాలెంజ్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జిల్లాలోని అల్మాస్‌పూర్, గంభీరావుపేట మండలం దమ్మన్నపేట పాఠశాలలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు తక్కువ ఖర్చుతో పరికరాలను తయారు చేసి ప్రదర్శించడంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. సహస్ర, హరివర్ధన్, స్పందన, రేఖలు తయారు చేసిన ప్రాజెక్టులు గొడుగు, బ్యాగులు, వ్యవసాయ కూలీలపై రూపొందించిన పరికరాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపితే జాతీయస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. గైడ్‌టీచర్ ఐనేని విక్రమ్‌తోపాటు విద్యార్థులను ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ రాధారపు పుష్పల, ఉపసర్పంచ్ బాలయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ పద్మ, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, హెచ్‌ఎం లక్ష్మణ్ అభినందించారు.

ఎన్నికలప్పుడే అభివృద్ధి గుర్తుకొస్తుందా?

- ‘డబుల్’ ఇళ్లు పూర్తయ్యేదెప్పుడో..
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడఅర్బన్: ప్రభుత్వానికి ఎన్నికలు వస్తున్నాయంటేనే అభివృద్ధి గుర్తుకొస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల పేరిట సంబరాల కంటే ముందు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పేదలకు అందించాలని కోరారు. వేములవాడ–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఆదివారం నిరసన తెలిపిన అనంతరం తిప్పాపూర్ శివారులో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నాణ్యత లోపించిందన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 10 వేల ఇళ్లు మంజూరు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు మీరు చూపిస్తే.. ఎన్నికల్లో ఓటు అడగం.. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేని ఊరు మేము చూపిస్తాం.. రానున్న ఎన్నికల్లో మీరు ఓట్లు అడగకండని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, వకుళాభరణం శ్రీనివాస్, చిలుక రమేశ్, ముడికె చంద్రశేఖర్, చంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల కొమురయ్య, పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేశ్, నాగుల విష్ణు, ఎర్రం రాజు, తోట లహరి, బొజ్జ భారతి, చిలివేరి శ్రీనివాస్, రాజేందర్, కిరణ్, ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, పర్శ రాములు, తిరుపతి, నరేశ్, రాజు ఉన్నారు.

ఉత్తమ మున్సిపాలిటీగా సిరిసిల్ల

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు నిర్వహించిన పోటీలలో 50వేల నుంచి లక్ష జనాభా గల మున్సిపాలిటీలలో సిరిసిల్ల మున్సిపాలిటీ అవార్డు దక్కించుకుంది. పురపాలక సంఘం ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ నిర్మూలన బర్తన్ బ్యాంక్ ఏర్పాటు, పొడిచెత్త నిర్వహణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేయనున్నారు.

రేషన్ డీలర్ల సమ్మెబాట

- గౌరవ వేతనం కోసం డిమాండ్
- జిల్లాలో మూతపడ్డ 345 రేషన్‌దుకాణాలు



నిరసన ప్రదర్శనలో రేషన్ డీలర్లు(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): రేషన్‌డీలర్లు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 345 చౌకధరల దుకాణాలు శనివారం నుంచి మూతపడ్డాయి. కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం డీలర్లు సమ్మె చేపట్టారు. బియ్యం, ఇతర సరుకులను తీసుకోవడానికి డీలర్లు ముందుకురావడం లేదు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం సానుకూలంగా ఉందని సమ్మె చేయొద్దని ఇటీవల చర్చలు చేపట్టగా.. మళ్లీ ఎలాంటి స్పందన లేకపోవడంతో డీలర్లు సమ్మెబాటను ఎంచుకున్నారు.


అరకొర కమీషన్

జాతీయ ఆహార భద్రత చట్టం 2015 అమల్లోకి రాక ముందు రేషన్‌బియ్యం కిలోకు రూ.20పైసల చొప్పున క్వింటాల్‌కు రూ.20 కమీషన్ వచ్చేది. జాతీయ ఆహారభద్రత చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ కమీషన్ రూ.70కి పెరిగింది. ఇందులో కేంద్రం రూ.35, రాష్ట్రం రూ.35 చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం రూ.22.50 కమీషన్ మాత్రమే వస్తుంది. ఆ కమీషన్ సరిపోక అద్దె, కరెంటు బిల్లులు ఇతరత్రా వాటిని చెల్లించేందుకు డీలర్లు నానా తంటాలు పడుతున్నారు. కరోనా పరిస్థితుల్లోనూ ప్రాణాలు ఫణంగా పెట్టి నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు

- కనీస గౌరవ వేతనం రూ.30వేలు చెల్లించాలి.
- రేషన్ దుకాణాలను మినీ సూపర్‌మార్కెట్లుగా తీర్చిదిద్దాలి.
- డీలర్లకు ఆరోగ్యకార్డులు అందించాలి.
- బియ్యం కమీషన్‌ను ప్రతీ నెల చెల్లించాలి.
- బియ్యం దిగుమతి హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలి.
- టీడీఎస్ కటింగ్ పేరిట కమీషన్ డబ్బులలో 5 శాతం కట్ చేస్తున్న పద్ధతికిస్వస్తి పలకాలి.
- హైదరాబాద్‌లో రేషన్ భవన నిర్మాణానికి వెయ్యి చదరపు గజాల స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలి.

గౌరవ వేతనం చెల్లించాలి



ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ల స్థానంలో కనీస గౌరవ వేతనం రూ.30వేలు ప్రకటించాలి. ప్రతీ ఇంటికి రేషన్ సరుకులను అందిస్తూ బాధ్యతాయుతంగా పనిచేస్తున్న డీలర్లను ప్రభుత్వం గుర్తించాలి.

– పురం రాజేశ్వర్‌రావు, రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు, గంభీరావుపేట

డిమాండ్లు నెరవేర్చాలి



దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమించం. ఏళ్లుగా ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

– హన్మండ్లు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రజల భద్రతే లక్ష్యం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- సిరిసిల్లలో ఘనంగా సురక్ష దివస్
- పోలీసు వాహనాలతో ర్యాలీ
- షీటీం, మహిళల భద్రతపై సదస్సు



సిరిసిల్లలో పోలీసుల ర్యాలీ



వేములవాడలో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: ప్రజల భద్రతే తమ లక్ష్యమని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సురక్ష దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో నిర్వహించిన పోలీస్ వాహనాల ర్యాలీ ఆకట్టుకుంది. కొత్తబస్టాండ్ వద్ద ఎస్పీకి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ఏదేని సమస్య ఉంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు. తక్షణమే స్పందించేందుకు బ్లూకోట్ పోలీసు సిబ్బంది ఉన్నారన్నారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించామన్నారు. జిల్లాలో 1,130 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి, వాటిని జిల్లా కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానించినట్లు చెప్పారు. త్వరలోనే పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పాస్‌పోర్టు విచారణను మూడు రోజుల్లో పూర్తి చేస్తున్నట్లు వివరించారు. గల్ఫ్‌మోసాలను అరికట్టేందుకు సీఐ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలో ఏడు అధికారిక మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీలు ఉన్నాయన్నారు. వీటిలో ఏమైనా మోసాలు జరిగితే చట్టపరిధిలో న్యాయం చేయడానికి అవకాశం ఉందన్నారు. అనంతరం సిరిసిల్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో ‘మీ పోలీసు స్టేషన్ గురించి తెలుసుకోండి’ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా ప్రజాప్రతినిధులను ఎస్పీ సన్మానించారు.

ధైర్యమే మహిళలకు ఆయుధం : జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

ఏ రంగంలో రాణించాలన్నా మహిళలకు ధైర్యమే ఆయుధమని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ పేర్కొన్నారు. పోలీస్ సురక్ష దివస్‌లో భాగంగా నిర్వహించిన షీటీమ్, మహిళా భద్రత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో మాట్లాడేందుకు చాలా భయమేసేదని.. ఇప్పుడు ఏ విషయంపైనైనా ధైర్యంగా మాట్లాడగలుగుతున్నట్లు చెప్పారు. అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌లు జిందం కళ, రామతీర్థపు మాధవి, డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, సీడీపీవోలు అలేఖ్యపటేల్, ఎల్లయ్య, ఏసీడీపీవో సుచరిత, ఏఎస్సై ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ప్రజల రక్షణ కోసమే పోలీసులు ఉన్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సురక్ష దివస్‌లో భాగంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించేలా పోలీసులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు తుపాకుల పనితీరు, జైలు, పోలీసుశాఖ పనితీరు వివరించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, ఎస్సైలు వెంకట్రాజం, రఫీక్‌ఖాన్, రాంరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ ఎగ్జిబిషన్ మేళాకు స్పందన

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మినీస్టేడియంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మేళాకు స్పందన లభించింది. వాహనాల తనిఖీ సమయంలో గంజాయి వంటి మత్తు పదార్థాలను ఎలా పట్టుకుంటారు.. బాంబులను గుర్తించి.. నిర్వీర్యం చేయడం, డాగ్‌స్క్వాడ్ పనితీరుపై వివరించారు. ఆయుధాల ప్రదర్శన, ఫొటో గ్యాలరీ, కమ్యూనికేషన్ సిస్టమ్ గ్యాలరీలు ఆకట్టుకున్నాయి. మేళాను కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్ సందర్శించారు. ఏఎస్పీ చంద్రయ్య, పట్టణ ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



పోలీస్ కవాతు



పోలీస్ జాగిలం ప్రదర్శన



ఆయుధాల ప్రదర్శన తిలకిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వ్యవసాయాన్ని చిన్నచూపు చూడొద్దు

బోయినపల్లి(చొప్పదండి): దేశంలో మూడేళ్లకు సరిపడా ఆహారపు నిల్వలు ఉన్నాయని, దేశానికి అన్నం పెట్టే వ్యవసాయరంగాన్ని చిన్నచూపు చూడొద్దని భారతీయ కిసాన్‌సంఘ్(బీకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జోగినిపల్లి రంగారావు ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగాపూర్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సమావేశాలు ఆదివారం ముగిశాయి. మోహిని మోహన్ మిశ్రా మాట్లాడుతూ దేశంలో రైతులు 40 రకాల పంటలు పండిస్తున్నారన్నారు. దేశంలో ఏటా రూ.6 లక్షల కోట్ల విత్తన వ్యాపారం సాగుతుందన్నారు. అధిక రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. రైతుల సమస్యలపై బీఎస్‌కే పోరాడుతుందని స్పష్టం చేశారు. ధరణితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరిశ్రమలకు భూసేకరణ చేయొద్దని కోరారు. నాయకులు సాయిరెడ్డి, నానా ఆక్రే, మాదిరెడ్డి రాజిరెడ్డి, పులి లక్ష్మీపతి, పోరెడ్డి సంజీవరెడ్డి, జోగినిపల్లి సంపత్‌రావు, బియ్యంకార్ శ్రీనివాస్, దూస రామస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేగంగా బాలాలయం నిర్మాణ పనులు


బాలాలయం నిర్మాణంలో భాగంగా స్లాబ్ వేస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నిర్మాణానికి టీటీడీ రూ.1.80 కోట్లు మంజూరు చేయగా, ముందుగా చేపట్టిన బాలాలయం నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. అయితే స్వామివారి ఆలయాన్ని కూల్చివేస్తే విగ్రహాలను భద్రపర్చడానికి బాలాలయం నిర్మిస్తారు. ఈక్రమంలో వచ్చే నెలలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్ తెలిపారు. అందుకే బాలాలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేస్తున్నామన్నారు. ఆదివారం స్లాబ్ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో తాటిచెట్టు ఎక్కుతుండగా జారీ కిందపడిన గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన విడుగురాళ్ల బాగయ్య గీత కార్మికుడు రోజువారి వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారీకింద పడ్డాడు. ఈ ప్రమాదంలో బాగయ్య కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీతకార్మికులు బాధితుడిని చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య


నర్సవ్వ మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన దీటి నర్స వ్వ(60) వృద్ధురాలు ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మ హత్య చేసుకుంది. కొంతకాలంగా అనా రోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఒంటరితనం, అనారోగ్యం కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యు ల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..


సత్యనారాయణ మృతదేహం

గంభీరావుపేట (సిరిసిల్ల): తాగుడుకు బానిసై, ఆర్థిక ఇబ్బందులకు తాళలేక జీవితంపై విరక్తి చెందిన గంభీరావుపేట మండలకేంద్రానికి చెందిన చెరుకు సత్యనారాయణ(55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం సత్యనారాయణ ఎలాంటి పనిచేయకుండా ఇంటివద్దే ఉంటూ తాగుడుకు బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

బియ్యం పంపిణీ

గంభీరావుపేట: మండలకేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమానికి ఎస్సై మహేశ్ బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆశ్రమంలోని వృద్ధులకు బియ్యంతో పాటు బిస్కెట్ ప్యాకెట్లు అందించారు.

నకిలీ విత్తనాలకు చెక్

- జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు
- విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


వేములవాడలో విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటేశ్

వేములవాడ అర్బన్: జిల్లాలో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ అధికారులు నిఘా పెంచారు. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతున్నారని, ముందుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమై టాస్క్‌పోర్స్ కమిటీలను నియమించారు. ఈ కమిటీల తనిఖీలతో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట పడనుంది.

250 విత్తన దుకాణాలు

జిల్లాలో ఈ సంవత్సరం పత్తి సాగు విస్తీర్ణం పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం రైతులు ఆశించిన మేర దిగుబడి వచ్చింది. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు తెలుపుతున్నారు. ఈ సంవత్సరం జిల్లాలోని 55 వేల ఎకరాల్లో పత్తిని సాగు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 250 విత్తన దుకాణాలు ఉన్నాయి. సుమరు 2 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం ఉంటుంది. ఈ సంవత్సరం కూడా రైతులు పత్తి వైపే మొగ్గు చూపాలని చెబుతున్నారు.

జిల్లాలో 14 టాస్క్‌పోర్స్ కమిటీలు

జిల్లాలో 14 టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 13 మండలాలకు 13 కమిటీలు, జిల్లాలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ అధికారి, మండల పరిధిలోని ఎస్సై, సీఐలతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలతో విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నారు.

దుక్కులు సిద్ధం చేసుకోవాలి

రైతులు దుక్కులు సిద్ధం చేసుకోవాలి. వర్షం పడిన తర్వాత దుక్కి సిద్ధం చేసుకొని విత్తనాలు నాటుకోవాలని అధికారులు తెలుపుతున్నారు. తొందర పడి చిరు జల్లులకే విత్తనాలు నాటి నష్టపోవద్దని తెలుపుతున్నారు.

తనిఖీలు చేస్తున్న



జిల్లాలోని రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పకుండా తీసుకోవాలి. బిల్లులు లేని విత్తనాలను కొనుగోలు చేయకూడదు. పంట పండించేంత వరకు రశీదును భద్రంగా ఉంచుకోవాలి. ఇప్పటికే అన్ని విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు చేస్తున్నాం.

– భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు



నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసగించినట్లు తమ దృష్టికివస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలి. అన్ని దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– సీఐ వెంకటేశ్, వేములవాడ టౌన్

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు..

- తండ్రి మందలించాడని మనస్తాపంతో పదోతరగతి విద్యార్థిని బలవన్మరణం


శరణ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): పదోతరగతిలో మంచి జీపీఏతో పాసైన ఓ విద్యార్థిని సెల్‌ఫోన్ వాడొద్దని మందలించడంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బోయినపల్లి మండలం విలాసాగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. విలాసాగర్‌కు చెందిన శేఖర్–లావణ్య దంపతుల కూతురు పోలె శరణ్య (16), ఇటీవలే పదోతరగతిలో 8.3 జీపీఏతో పాసైంది. శనివారం సెల్‌ఫోన్ చూస్తుండగా శరణ్యను తండ్రి మందలించడంతో రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లోనే పడుకుంది. తెల్లారి చూసేసరికి శరణ్య కనిపించకపోవడంతో పోలీసులకు సమాచా రం అందించారు. గ్రామంలో వెతుకుతుండగా సాయంత్రం ఓ బావిలో శరణ్య శవమై కనిపించింది. సెల్‌ఫోన్ వాడొద్దని మందలించినందుకు మనస్థాపం చెందిన శరణ్య మర్లపేట నుంచి విలాసాగర్ వెళ్లే దారిలోని ఓ వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణం చెందినట్లు తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్
- రెండు గ్రామాల్లో విషాదం


కృపానంద్ (ఫైల్)


గంగాధర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: నలుగురు స్నేహితులు సరదాగా కలిశారు.. మాటల్లో దిగారు.. ఆదివారం వేకువ జామున రెండు బైక్‌లపై ఇళ్లకు బయలుదేరారు. ఈక్రమంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహంకాళి నర్సయ్య– కళావతి కుమారుడు కృపానంద్(22), మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన బడుగు మొండయ్య– సుజాత కొడుకు గంగాధర్(19) స్నేహితులు. వీరితో పాటు మరో ఇద్దరు స్నేహితులు శనివారం రాత్రి జగిత్యాలలో కలుసుకున్నారు. లింగంపేట శివారుకు వెళ్లారు. ఆదివారం ఉదయం 3గంటల సమయంలో ఇళ్లకు బయలుదేరారు. కృపానంద్, గంగాధర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ కొత్తబస్టాండు ఔట్ గేట్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. పట్టణ ఎస్సై వేణురావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గంగాధర్ తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

రెండు గ్రామాల్లో విషాదం

నిత్యం కలిసిమెలిసి ఉండే ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో లక్ష్మీపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది. వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

సరైన విధానంలో సర్దుబాటు చేయండి

- బయోమెట్రిక్ హాజరుపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- డీఈవో రమేశ్‌కుమార్‌కు టీపీటీఎఫ్ నాయకుల వినతి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరంలో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ముందుకు సాగాలని అందుకు తగిన విధానాలను అవలంభించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్ రెడ్డి, దుమాల రమానాథ్ రెడ్డి డీఈవో రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ

- ఉపాధ్యాయుల సర్దుబాటుపై సరైన విధానం రూపొందించి ఉత్తర్వులకు ముందే ఉపాధ్యాయులకు సమాచారం అందించి జూన్ 12లోపు ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు.
- బయో మెట్రిక్ యంత్రాల పనితీరు మెరుగుపరచి, వాటిని నిరంతరం పర్యవేక్షించేలా చూడాలని విన్నవించారు.
- హెచ్‌ఎంలను విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టించడం కోసమే కాకుండా దుస్తుల పంపిణీ ప్రక్రియకే బాధ్యుల్ని చేయాలని కోరారు.
- యూనిఫామ్స్ కుట్టించే విషయంలో నాణ్యతప్రమాణాలు పాటించే వారికే కాంట్రాక్టు ఇవ్వాలన్నారు.
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మొక్కుబడిగా కాకుండా సరైన క్రమంలో నిర్వహించేలా చూడాలని, ఉచిత పాఠ్య పుస్తకాలు అన్ని టైటిల్స్, నోట్ బుక్స్‌ని జూన్ 12 లోపు అందేలా చూడాలన్నారు.
- రాగి జావ పంపిణీకి స్కూల్ పాయింట్‌లోనే మెటీరియల్ అందించాలని విన్నవించారు.
- ప్రభుత్వపాఠశాలలో చేరిన విద్యార్థికి పూర్వ పాఠశాల నుంచి టీసీ ఇచ్చేందుకు వేధింపులు లేకుండా చూడాలని కోరారు.

బడిబాట షురూ

- ప్రవేశాలకు ప్రచారం
- పల్లెలకు సర్కారీ సార్లు
- సౌకర్యాలు వివరిస్తూ ముందుకు
- రోజువారీ ప్రవేశాల నమోదుకు చర్యలు
- జిల్లా విద్యాధికారి రమేశ్


ప్రచారాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలను పెంచేందుకు సర్కారీ సార్లు బడిబాట ప్రచారం మొదలు పెట్టారు. ఈనెల 3 నుంచి 17వ తేదీ వరకు బడిబాట నిర్వహించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. బడిబాటను జిల్లాలోని 170కి పైగా పాఠశాలలో ప్రారంభించినట్లు డీఈవో రమేశ్ వెల్లడించారు. బడీడు పిల్లలు బడిబయట ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రైవేటు దీటుగా ప్రచారం..

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు బడిబాట ప్రచారం సాగిస్తున్నాయి. ఆటోలకు మైకులు పెట్టి ఆయా పాఠశాలలు సాధించిన ప్రగతిని ఆడియోలో వినిపిస్తూ ముందుకు సాగుతున్నారు. పాఠశాలలోని సౌకర్యాలను తెలిపి విద్యార్థులకు పాఠశాలకు రప్పించేలా చేస్తున్నారు. ఉచిత పుస్తకాలు.. నోట్స్.. భోజనం... డ్రెస్ ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఇన్నాళ్లు పుస్తకాలు, డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం అందించిన విషయం తెలిసిందే. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అవసరమైన నోటుబుక్కులను అందించేందుకు రంగం సిద్ధమైంది. అంతేకాకుండా కొన్ని పాఠశాలలో దాతల సహకారంతో అందించిన ప్రొజెక్టర్‌తో విద్యా బోధన వంటి ప్రత్యేక అంశాలను వివరిస్తూ ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా కౌన్సిలింగ్ చేస్తున్నారు.

విద్యాబోధన.. ఫలితాలు తెలుపుతూ..

గతేడాది పదో తరగతిలో తమ విద్యార్థులు సాధించిన ఫలితాలను ప్రధాన ఎజెండాగా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు బడిబాటలో ప్రచారం చేస్తున్నారు. చదువుతోపాటు ఇన్‌స్పైర్ మనాక్, ఇంటింటా ఇన్నోవేటర్ వంటి శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తున్న విద్యార్థుల వివరాలను తెలిపి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మెరుగైన బోధన తీరును విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలిపి ప్రవేశాలు కోరుతున్నారు. మన ఊరు మన బడిలో జిల్లాలోని వివిధ మండలాల్లో సౌకర్యాల కల్పనకు ఈ ఏడాది ప్రవేశాలకు పెరుగుదలకు కాస్త ఊరటనిస్తాయన్న ఆశాభావం సీనియర్ ఉపాధ్యాయులు వెల్లడిస్తున్నారు. సిరిసిల్లలోని బాలికల విద్యాలయంతో పాటు శివనగర్ పాఠశాలలో ప్రవేశాలు ఫుల్ బోర్డు పడే అవకాశాలుంటాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

17వ తేదీ వరకు బడిబాట



జిల్లాలోని బడీడు పిల్లలను బడిలో చేర్పేందుకు ఈనెల 17వ తేదీ వరకు బడిబాట నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలో అందించే నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, డ్రెస్సులు, నోటుబుక్కులు అందించే విధానాన్ని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. నయా పైసా ఖర్చులేకుండా నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. బడిబాటలో రోజువారీగా నమోదవుతున్న ప్రవేశాలను ఉపాధ్యాయులు విధిగా నమోదుచేసి జిల్లా కార్యాలయంలో నమోదుకు పంపాలి.

– రమేశ్, డీఈవో, సిరిసిల్ల

ఇంటింటికి వెళ్తున్నాం



బడి బాటలో భాగంగా విద్యార్థులను చేర్పించడానికి ఇంటింటా తిరుగుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి కలిగే ప్రయోజనాలు చెబుతున్నాం. సన్నబియ్యంతో భోజనం, ఉచిత పుస్తకాలు, బోధనపై వివరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలో చదివి సాధించిన ప్రగతిని వివరిస్తున్నాం. విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు సానుకూలంగా స్పందిస్తున్నారు.

– గసికంటి శ్రీనివాస్, టీచర్, బోయినపల్లి

జిల్లా దాటుతున్న ఇసుక

- అనుమతుల పేరుతో అక్రమ రవాణా..?
- పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్: మండలంలోని మూలవాగు నుంచి అనుమతుల పేరుతో కొంతమంది ఇసుకను తరలిస్తూ, ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల మల్లారం, పట్టణ మూలవాగు నుంచి ప్రభుత్వ పనులు, ప్రైవేటు పనులకు రెవెన్యూ, పోలీస్ శాఖ అనుమతులతో ఇసుకను తరలించేందుకు జిల్లా యంత్రాంగం అనుమతులు ఇచ్చారు. దీనిని ఆసరా చేసుకున్న కొంతమంది ట్రాక్టర్ యజమానులు పట్టణ, రూరల్ ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. కొన్ని రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది అధికారులు వారి వద్ద నుంచి మామూళ్లు దండుకుని వదిలేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏదేమైనప్పటికీ అనుమతుల పేరుతో అక్రమంగా ఇతర ప్రాంతాలకు కొంతమంది ఇసుకను తరలించడం, కొంత మంది గృహ యజమానులకు ఇసుక కోసం అధికారుల చుట్టూ తిరిగినా అనుమతులు ఇవ్వకపోవడం ఏంటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హరితహారం చెట్ల నరికివేత



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారికి ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన చెట్లను ఆదివారం అల్మాస్‌పూర్‌కు చెందిన ఓ రియలర్ నరికివేశాడు. మండల కేంద్రంలోని తన అపార్ట్‌మెంట్‌కు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా గ్రామగ్రామాన మొక్కలు నాటుతుంటే కొందరు ఇలా తమ భవనాలకు అడ్డుగా ఉన్నాయని చెట్లను తొలగిస్తున్నారు. హరితహారం కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మూడు నెలల క్రితం ఎల్లారెడ్డిపేట ఈవో ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మొక్కలకు గ్రామపంచాయతీ సిబ్బంది నిత్యం ట్రాక్టర్‌తో నీళ్లు పట్టి బతికిస్తుంటే కొందరు ఇలా మొక్కలను నరికివేస్తున్నారు.


2001-2002 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

20 ఏళ్లకు కలిశారు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇరువై ఏళ్ల క్రితం చదువుకొని ఉన్నత విద్యకోసం విడిపోయిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 2001-2002 పదోతరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికగా నిలిచింది. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని, స్నేహితులతో సంతోషంగా గడిపారు. అప్పటి గురువులు లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోష్ణ, ఉమాపతిలను సత్కరించారు. ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ రాధారపు పుష్పల, ఎస్‌ఎంసీ చైర్మన్ పద్మ, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


1996-97 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ముస్తాబాద్: జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1996-97 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన తమను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రోజంతా స్నేహితులతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్శరాములు, ఆనంద్‌రావు, దేవదాస్, రాంరెడ్డి, కనకయ్య, సుధాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు అబ్రమేని దేవేందర్, మహేశ్, బాలనర్సయ్య, కంచం నర్సయ్య, రాజిరెడ్డి, దబ్బెడ రాజు, దేవి రెడ్డి, మంజుల, ఎం. మంజుల, వినోద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సిడ్నీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు







సిరిసిల్లఅర్బన్: ఆస్ట్రేలియన్ తెలంగాణ ఫోరమ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియన్ తెలంగాణ ఫోరమ్ కోశాధికారి వినయ్‌కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. బంగారు తెలంగాణ సాధనలో తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ పోస్టర్‌ను ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక పారామాటా మేయర్ సమీర్ పాండే, బ్లాక్‌టౌన్ కౌన్సిలర్ లివింగ్‌స్టన్ చిటిపల్లి, తెలంగాణ గవర్నర్ సెక్రెటరీ సురేంద్రమోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు కడపర్తి ప్రశాంత్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, వాణి ఏలేటి, శ్రీనివాస్ సుతారి తదితరులు పాల్గొన్నారు.